ప్రజల చేతిలో

www.ayudamdaily.com

ఆయుధం

The Common People's Voice

గురువారం | నవంబరు 05, 2026 | సంపుటి : 7 | సంచిక : 130 | పేజీలు : 2





సదర్ అంటే తెలంగాణ ఆత్మగౌరవం

- హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేస్తాం
- ప్రభుత్వ సంకల్పానికి యాదవుల సంపూర్ణ సహకారం అవసరం
- హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా సదర్ వేడుకలు
- సమ్మేళనానికి సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆయుధం: రాష్ట్ర ప్రజలందరికి రేవంత్ రెడ్డి సదర్ శుభాకాంక్షలు తెలిపారు. సదర్ సమ్మేళనం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సదర్‌ను అధికారిక పండుగగా నిర్వహిస్తోందని చెప్పారు. హైదరాబాద్‌లో అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజలు శాంతియుతంగా, సుఖ సంతోషాలతో జీవిస్తున్నారన్నారు. సదర్ సంబురాల ద్వారా యాదవులు పండుగ నిర్వహించుకుంటారని తెలిపారు. సదర్ వేడుకలకు రూ.5 కోట్ల నిధులు కేటాయించామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం సదర్ వేడుకలతో సందడిగా మారింది. యాదవుల సంప్రదాయాలు, సంస్కృతి, ఐక్యతను చాటిచెప్పేలా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో శ్రీకృష్ణ సదర్ సమితి సదర్ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి యాదవులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన దున్నరాజుల ప్రదర్శనలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

..: మిగతా 2 లో..

నాలుగు నగరాల్లో ఇందిరమ్మ టవర్లు

- రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్లు
- నిజామాబాద్, వరంగల్, నల్గొండ, కరీంనగర్ కార్పొరేషన్ల పరిధిలో నిర్మాణాలు: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్, ఆయుధం:

రాష్ట్రంలో మరో నాలుగు నగరాల్లో ఇందిరమ్మ టవర్లు నిర్మించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్, వరంగల్, నల్గొండ, కరీంనగర్ కార్పొరేషన్ల పరిధిలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. హైదరాబాద్ తరహాలో అల్పాదాయ కుటుంబాలకు జీ ప్లస్ 5 అంతస్తుల ఇందిరమ్మ టవర్లు నిర్మించనున్నట్లు వివరించారు. మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజాప్రతినిధులతో రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై ఇన్‌ఛార్జి మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా గృహ ప్రవేశాలు జరిగిన ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సంబరాలు జరపాలని మంత్రి తెలిపారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో నిర్వహించే సంబరాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేక పోయినప్పటికీ.. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్న మంత్రి పొంగులేటి.. ఇప్పటివరకు రూ.22,500 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించగా.. అందులో 2,21,500 గృహ ప్రవేశాలు జరిగాయని.. మరో 1.90 లక్షల గృహాలు వివిధ దశల్లో ఉన్నట్లు వివరించారు. రెండో విడతలో మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. హైదరాబాద్ కోర్ అర్బన్‌లో లక్ష ఎల్ఐజీ ఫ్లాట్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

యువత లక్ష్య సాధనకు ప్రభుత్వం అండ

- శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోలీస్ ఉద్యోగాలు సాధించాలి
- రాష్ట్ర మంత్రి అనసూయ సీతక్క

ములుగు, ఆయుధం: యువత లక్ష్య సాధనకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, పట్టుదలతో చదివి పోలీస్ ఉద్యోగాలు సాధించాలని అభ్యర్థులకు సూచించారు. బుధవారం ములుగు ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను మంత్రి పరిశీలించారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో నేరుగా మాట్లాడి, వారి చదువు, శిక్షణా విధానం, వసతి సౌకర్యాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల్లో మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. భ్యర్థులు లక్ష్యంపై దృష్టి సారించి, క్రమ శిక్షణతో శిక్షణ పొందాలని సూచించారు. ఎక్కువ మంది అభ్యర్థులు ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించి, తదుపరి దశల్లోనూ ప్రతిభ కనబరిచి పోలీస్ ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. అభ్యర్థుల విజయానికి అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రి శిక్షణార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, డీఎస్పీ రవీందర్, ఆర్ఐ, సీఐ, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.






పారదర్శకంగా భూముల రీసర్వే

- హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

2 లో



ముసురు ఎఫెక్ట్

పలుచోట్ల విస్తారంగా వర్షాలు

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు
- జిల్లాలో పొంగి పొర్లుతున్న వాగులు వంకలు, చెరువులు

కొత్తగూడెం, ఆయుధం: ముసురు తుపాను ప్రభావంతో భద్రాద్రి కొత్తగూడెంలో కుండపోత వర్షాలు కురిశాయి. వాగులు వంకలూ పొంగిపొర్లాయి. పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వందల ఎకరాల్లో పంట నీట మునిగింది. వర్ష తీవ్రత దృష్టిలో ఉంచుకొని అధికారులు స్థానికంగా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. వర్షాల కారణంగా ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

ఎడతెరిపిలేని వర్షాలు

ముసురు తుపాను తీరం దాటిన తర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. నిన్న ఉదయం నుంచి చెదురు మదురుగా పడిన వర్షాలు రాత్రి నుంచి కుండపోతగా మారాయి. కొన్ని మండలాల్లో 16 నుంచి 20 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. అశ్వరావుపేట, ములకలపల్లి, దమ్మపేట, దమ్ముగూడెం, చర్ల, భద్రాచలం కొత్తగూడెం మండలాల్లో కురిసిన వర్షాలకు వాగులు వంకలూ పొంగి ప్రవహిస్తున్నాయి.

భారీ వర్షాలకు అశ్వారావుపేట మండలం పెదవాగు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. 4500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో అధికారులు వరద నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు రింగ్ బండ్ కట్టకు గండి పడింది. వేదాంతపురంలో ప్రధాన రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

రహదారిపై నిలిచిన రాకపోకలు

ములకలపల్లి మండలం కంపగూడెం అడ్డరోడ్డు సమీపంలోని, పాములేరు వాగుపై వంతెన ఇప్పటికే కూలిపోయిన నేపథ్యంలో నిర్మించిన తాత్కాలిక రహదారి కోతకు గురైంది. పాల్వంచ దమ్మపేట ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. దమ్మపేట మండలం ప్రధాన రహదారిపైకి వరద నీరు వచ్చి చేరడంతో మండలవాసులు తీవ్ర ఇక్కట్ల పాలైయ్యారు. దమ్మపేట శివారు నెమలిపేట కాలనీ సమీపంలోని నల్ల వీరయ్య చెరువు అలుగుకట్ట తెగి వరద నీరు భారీగా పారుతుంది. డిప్యూటీ శిక్షణ తహసీల్దార్ మురళి కాలనీ ప్రజలను పునరావాస కేంద్రానికి తరలించారు. ఈ మండలంలోని వరి, పత్తి ఆయిల్ పామ్ తోటలు వందల ఎకరాల్లో నీట మునిగాయి. ఈ నేపథ్యంలో ములకలపల్లి, అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

తీవ్రంగా దెబ్బతిన్న పంటలు

జిల్లాలోనూ వేంసూరు సత్తుపల్లి, వైరా కల్లూరు మండలాల్లో కురిసిన భారీవర్షంతో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. వందలాది ఎకరాల్లో వైరా నియోజకవర్గంలో ముసురు తుపాను ప్రభావంతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పొట్ట దశలో ఉన్న వరి పంట పూర్తిగా నేలకొరిగి నీటిపాలైంది. మిరప పొలాల్లో నీరు నిలవడంతో మొక్కలు నేలవాలాయి. ఏన్కూరు, కొనిజర్ల, తల్లాడ మండలాల్లో పత్తి తడిసి పాడైంది. ఎడతెరిపి లేకుండా (మిగతా 2లో..)

సమాజ సేవే లక్ష్యం

- ట్రస్టు ద్వారా పేదలకు సహకారం అందిస్తాం
- వర్ధినేని లక్ష్మణ్ రావు– లలితా చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు, ఛైర్మన్ లక్ష్మణ్ రావు

హనుమకొండ, ఆయుధం: మానవ సేవే.. మాధవ సేవ అనే నినాదంతో సమాజ సేవ లక్ష్యంగా ట్రస్టు స్థాపించామని వర్ధినేని లక్ష్మణ్ రావులలితా చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు, ఛైర్మన్ వర్ధినేని లక్ష్మణ్ రావు పేర్కొన్నారు. హనుమకొండలోని ఎక్సైజ్ కాలనీ లోని కార్యాలయంలో బుధవారం ట్రస్టు కార్యకలాపాలు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరుపేదలకు విద్య, వైద్యం, ప్రమాదాల్లో మరణించిన వారికి ఆర్థిక సహాయం అందించడం ట్రస్టు ముఖ్య ఉద్దేశ్యం అన్నారు.

..: వివరాలు 2లో..





బాధ్యతాయుతంగా పనిచేయాలి

- పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్
- ఎస్సైలు, స్టేషన్ రైటర్లకు 12 రోజుల శిక్షణ పూర్తి

వరంగల్, ఆయుధం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎస్సైలు, స్టేషన్ రైటర్లకు కేసుల దర్యాప్తు, కోర్టు విధానాలపై నైపుణ్యాన్ని పెంపొందించేందుకు పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అక్టోబర్ 22న ప్రారంభమైన 12 రోజుల ప్రత్యేక శిక్షణ తరగతులు నవంబర్ 4న ముగిశాయి. ఈ శిక్షణలో భాగంగా కేసుల దర్యాప్తు విధానం, శాస్త్రీయ ఆధారాల సేకరణ, సాక్షుల విచారణ, వివిధ శాఖల నుంచి అవసరమైన ఆధారాల సేకరణ, చార్జిషీట్ల తయారీ, కోర్టులో సాక్షుల హాజరు, పటిష్టమైన ఆధారాలతో నేరస్థులకు శిక్షలు పడేలా కేసులను నిరూపించడం వంటి కీలక అంశాలపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ మాట్లాడుతూ, నాణ్యమైన దర్యాప్తు, పకడ్బందీగా ఆధారాల సేకరణ, సమర్థవంతమైన ప్రాసిక్యూషన్ ద్వారా కేసులను పకడ్బందీగా నిరూపించేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అధికారుల పనితీరు, దర్యాప్తులో చూపే ప్రతిభ, కేసుల పరిష్కారంలో సాధించే ఫలితాలను బట్టి ప్రతిభ కనబరిచిన అధికారులకు అవార్డులు, రివార్డులు అందజేస్తామని పోలీస్ కమిషనర్ తెలిపారు. దర్యాప్తులో ప్రతి అంశానికి ప్రాధాన్యతనిస్తూ, చట్టపరమైన విధానాలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, సిసిఆర్బి ఏసీపీ డేవిడ్ రాజ్, సీసీఎస్ ఏసీపీ సదయ్య, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, సిసి ఆర్బి ఇన్స్పెక్టర్ దామోదర్ రెడ్డి తో పాటు ఇతర పోలీస్ అధికారులు, ఎస్సైలు, స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.



ఏపీలో పలు జిల్లాలకు వర్ష సూచన



అమరావతి, ఆయుధం:

'ముసురు' ప్రభావంతో గోదావరి జిల్లాల్లో బుధవారం భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ఏలూరు జిల్లా బయ్యనగూడెంలో 18.2 సెం.మీ, జీలుగుమిల్లిలో 13.9, పి.నారాయణపురంలో 12.8, కాకినాడ జిల్లా ఆర్యవటంలో 12.6, పెదపూడిలో 12.6, కాజులూరులో 12.1, కరపలో 12, వేళంగిలో 11.4, జి.మామిడలో 11.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

గురువారం.. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, మార్కాపురం, ప్రకాశం, నంద్యాల, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆకస్మిక వరదల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



పారదర్శకంగా భూముల రీ సర్వే

- భూముల రీసర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం
- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

ఆత్మకూరు, ఆయుధం: భూముల రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం ఆత్మకూరు మండలం బ్రాహ్మణ పల్లి రెవెన్యూ లోని కామారం గ్రామం లో జరుగుతున్న భూముల రీ సర్వే తీరును హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంకా ఎన్ని ఎకరాలలో సర్వే పూర్తి చేయాల్సి ఉందనే వివరాలను భూములు, కొలతలు శాఖ ఏడీ నూర్ సింగ్, సర్వేయర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎన్ని రోవర్లతో సర్వే నిర్వహిస్తున్నారని ఆరా తీశారు. అక్కడ ఉన్న స్థానిక రైతులతో సర్వే తీరు గురించి కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ భూముల సరిహద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాలను కచ్చితంగా నమోదు చేసే దిశగా రీసర్వే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. భూముల రీసర్వేను పూర్తి చేయడంలో రైతులు సహకరించాలని సూచించారు. సర్వే సమయంలో రైతులు తమ భూమి హద్దులను సరిగా చూపించాలని అన్నారు. సర్వేయర్లు సర్వే సమయం లో జాగ్రత్తలు వహించాలని సూచించారు. పారదర్శకంగా చేపడుతున్న భూముల రీసర్వేతో రైతుల భూ హక్కులకు భరోసా లభిస్తుందన్నారు. రీసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు, సర్వేయర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, కామారం సర్పంచ్ తోట లక్ష్మీ, ఇతర అధికారులు, సర్వేయర్లు, స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఈ–హెచ్ఆర్ఎంఎస్ విధానంపై అవగాహన



ములుగు, ఆయుధం: ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు రికార్డులు, వ్యక్తిగత వివరాలు, సేవా సంబంధిత కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన ఈహెచ్ఆర్ఎంఎస్ విధానంపై బుధవారం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ సంచాలకులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం కొనసాగింది. ప్రస్తుతం అమలులో ఉన్న హెచ్ఆర్ఎంఎస్ విధానం స్థానంలో ప్రవేశపెడుతున్న నూతన ఈహెచ్ఆర్ఎంఎస్ విధానాన్ని అన్ని శాఖల్లో సమర్థవంతంగా అమలు చేసేందుకు అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. నూతన విధానం ద్వారా ఉద్యోగుల సర్వీసు సంబంధిత కార్యకలాపాలను వేగవంతంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలవుతుందని అధికారులు పేర్కొన్నారు. విధానం అమలుకు సంబంధించిన అంశాలను వివరించారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డీడీఓలు), వారి కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఈహెచ్ఆర్ఎంఎస్ విధానాన్ని అన్ని శాఖల్లో సమర్థవంతంగా అమలు చేసేందుకు అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. నూతన విధానం ద్వారా ఉద్యోగుల సర్వీసు సంబంధిత కార్యకలాపాలను వేగవంతంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలవుతుందని అధికారులు పేర్కొన్నారు.



మూశం సారంగపాణి కుటుంబానికి
రూ.57 వేల ఆర్థికసాయం

వరంగల్, ఆయుధం: వరంగల్‌లోని కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన మూశం సారంగపాణి ఇటీవల అకాల మరణం చెందడంతో, ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు చిన్ననాటి మిత్రులు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా కాశిబుగ్గకు చెందిన సారంగపాణి చిన్ననాటి మిత్రులు అందరూ కలిసి రూ.57,000 ఆర్థిక సహాయాన్ని సేకరించి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబు చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. ఆపద సమయంలో స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన చిన్ననాటి మిత్రులను ఈ సందర్భంగా అభినందించారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు మనకు చేతనైన సహాయం అందించడం మానవత్వానికి నిదర్శనమని అశోక్ బాబు పేర్కొన్నారు. స్నేహం అంటే కష్టకాలంలో తోడుగా నిలవడం అనే విషయాన్ని ఈ మిత్రులు మరోసారి నిరూపించారు. ఈ కార్యక్రమంలో లయన్ పోషల సురేందర్, దండు దయాసాగర్, రామ రమేష్, మహేందర్, యుగేందర్, వెంకన్న, కృష్ణ, జగన్, గోరంటల మనోహర్, మంతెన అమ్రేష్, పెద్ద ఎత్తున చిన్ననాటి మిత్రులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులను వేగవంతం
చేసి త్వరగా పూర్తి చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ, ఆయుధం: జిల్లావ్యాప్తంగా వివిధ దశల్లో కొనసాగుతున్న భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై పంచాయతీ రాజ్ అధికారులతో, ఎంపీడీఓ లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజలకు త్వరగా అందుబాటులోకి రావాలంటే నిర్మాణాల్లో నాణ్యతతో పాటు వేగం కూడా ముఖ్యమని పేర్కొంటూ, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న కాంపౌనెంట్ పనులు, వి ఓ, అంగన్వాడీ, జీపీ భవనాల నిర్మాణాలను రాబోయే 10 రోజుల్లో యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పనుల పురోగతిని పెంచాలని సూచించారు. పనుల్లో జాప్యానికి కారణాలను గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సమాజ సేవే లక్ష్యం

ట్రస్టు ద్వారా పేదలకు సహకారం అందిస్తాం

- వర్ధినేని లక్ష్మణ్ రావు- లలితా చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు, ఛైర్మన్ లక్ష్మణ్ రావు

హనుమకొండ, ఆయుధం:
మానవ సేవే.. మాధవ సేవ అనే నినాదంతో సమాజ సేవ లక్ష్యంగా ట్రస్టు స్థాపించామని వర్ధినేని లక్ష్మణ్ రావులలితా చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు, చైర్మన్ వర్ధినేని లక్ష్మణ్ రావు పేర్కొన్నారు. హనుమకొండలోని ఎక్సైజ్ కాలనీ లోని కార్యాలయంలో బుధవారం ట్రస్టు కార్యకలాపాలు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరుపేదలకు విద్య, వైద్యం, ప్రమాదాల్లో మరణించిన వారికి ఆర్థిక సహాయం అందించడం ట్రస్టు ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. తాను యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ గ్రూపులో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా 45 సంవత్సరాల సుదీర్ఘకాలం పనిచేశానని... జీవితంలో ఆర్థికంగా స్థిరపడ్డానని తెలిపారు. తమ కుటుంబానికి కూడా మంచి జీవితాన్ని అందించినట్లు పేర్కొన్నారు. ''గత వెయ్యేళ్ల చరిత్ర చూసినా.. రాజులు, రాజ్యాలు ఎక్కడా ఎవరూ పేదలకు పూర్తిగా చేసిందేమీ లేదు. సహాయం చేసిన వాళ్లు లేరు. ప్రజా ప్రభుత్వాలు వచ్చినప్పటికీ నిరుపేదలకు అందగా నిలవడం లేదు. బ్రిటీషు పాలనలో మొత్తం దేశాన్ని నాశనం చేసి దోచుకుపోయారు. దేశంలో 70శాతం వరకు పేదలే జీవిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చాక యువతరం బాగా చదువుకుంటూ ఉద్యోగాలు చేస్తూ స్థిరపడుతున్నారు. మంచి జీవితం గడుపుతున్నారు. సమాజంలోని పేద కుటుంబాల నుంచి వచ్చే యువతరం కూడా బాగా చదువుకుని జీవితంలో స్థిరపడాలి'' అని ఆయన ఆకాంక్షించారు.
తమ ట్రస్టు ద్వారా పేదలకు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. మానవ సేవే మాధవ సేవ అనే నినాదంతో సమాజ సేవ లక్ష్యంగా ట్రస్టు స్థాపించామని ప్రకటించారు. ప్రతిఒక్కరూ తమకు సహకరించాలని లక్ష్మణ్ రావు విజ్ఞప్తి చేశారు.



ఆక్టివ్ ఏజెంట్‌గా పోటీ..
లక్ష్మణ్ రావు కు ఇన్సూరెన్స్ కంపెనీలో రిటైర్‌మెంట్ ఇచ్చినప్పటికీ తను ఏజెంట్‌గా పనిచేస్తూ ప్రస్తుత యువ ఏజెంట్లకు సైతం పోటీ ఇస్తున్నారని యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ డీఎం సంతోష్ అన్నారు. లక్ష్మణ్ రావు తను పెట్టుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు కష్టపడి పనిచేస్తారని.. ఆ లక్ష్యం చేరుకునే లోపే మరో లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళుతారని గుర్తు చేశారు. లక్ష్మణ్ రావు జీవితంలో ఎదగడమే కాకుండా తన వద్ద పనిచేసిన వారు కూడా స్థిరపడేందుకు తన అమూల్యమైన సలహాలు, సూచనలు చేస్తూ ముందుకు తీసుకెళతారని కొనియాడారు. యువ ఏజెంట్లకు ప్రోత్సాహం అందిస్తారని అన్నారు. ట్రస్టు ఏర్పాటు చేయడం అనేది లక్ష్మణ్ రావు కల అని.. మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సంస్థ సక్సెస్ కావాలని.. అవసరార్థులకు సహాయం అందించి లక్ష్యం చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.
'లక్ష్మణ్ రావు సాధారణ వ్యక్తి కాదు.. ఆయన వయస్సుకు, ఆయన చేసే పనికి సంబంధం లేదు. ఇన్సూరెన్స్ సంస్థలో రిటైర్‌మెంట్ అయినా ఏజెంట్‌గా చేరి లక్ష్యాలు నిర్దేశించుకుని పనిచేయడం లక్ష్మణ్ రావు గొప్పతనం అని యునైటెడ్ ఇండియా ఏడీఎం సందీప్ అన్నారు. తను లక్ష్యం చేరుకోగానే రిలాక్స్ కాకుండా తరువాత చేయాల్సిన పనిలో నిమగ్నం కావడం ఆయన సక్సెస్‌కు నిదర్శనం అని గుర్తు చేశారు. లక్ష్మణ్ రావు మంచి లక్ష్యంతో ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా నిజమైన అవసరార్థులకు సహాయం అందేలా చూడాలని ఆయన ఆకాంక్షించారు. అర్హులకు సకాలంలో సహాయం చేయడం వారికి మరో జీవితం ఇచ్చినట్లేనని.. సమాజంలో సంస్థకు మంచి గుర్తింపు వచ్చేలా కార్యకలాపాలు కొనసాగాలని సందీప్ కోరారు. సమాజ సేవే లక్ష్యంగా ట్రస్టు స్థాపించిన లక్ష్మణ్ రావు ను పలువురు అభినందించారు. ఆయన ఉన్నతమైన ఆశయం నెరవేరాలని, ట్రస్టు ద్వారా అవసరార్థులకు సహాయం అందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి కాకు లమర్రి ప్రవీణ్, ఉపాధ్యక్షులు బొయినపల్లి ప్రభాకర్ రావు, లక్ష్మన్ రావు, అశోక్ రావు, అవినాష్, దేవేందర్ రావు, రవీందర్ రావు, డాక్టర్ ఎర్రబెల్లి పట్టాభిరామా రావుడాక్టర్ సృజన, ఎర్రబెల్లి దిలీప్ రావు, తంగెడ వేణుగోపాల్ రావు, లక్ష్మణ్ రావు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

నిబద్ధత, క్రమశిక్షణకు మారుపేరు లక్ష్మణ్ రావు
- గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు

'నా కుటుంబానికి ఎంతో చేశా.. సమాజానికి సేవ చేయాలి' అనే ఆలోచనతో ట్రస్టు స్థాపించిన లక్ష్మణ్ రావు ఆశయం నెరవేరాలని గ్రేటర్ వరంగల్ అధ్యక్షులు వేముల నాగరాజు ఆకాంక్షించారు. లక్ష్మణ్ రావు ఇన్సూరెన్స్‌లో 45 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం అసాధారణం. ఒకే సంస్థలో అనేక కష్టనష్టాలు ఓర్చుకుని.. లక్ష్యాలు సైతం చేరుకుని సంతోకరమైన క్షణాలు కూడా గడపడం.. సుదీర్ఘ కాలం ఒకే సంస్థలో పనిచేయడం అనేది ఆయన మంచితనానికి, క్రమశిక్షణకు నిదర్శనం. ఆరు నెలలు పనిచేయగానే 5వేల వేతనం పెరుగుతుందని.. అనేక సంస్థలు మారుతున్న ఈ రోజుల్లో ఒకే సంస్థలో పనిచేయడం లక్ష్మణ్ రావు గొప్పతనం. సుదీర్ఘ కాలంగా లక్ష్మణ్ రావు ఇన్సూరెన్స్ రంగంలో పనిచేసిన అనుభవం, ఆయన క్రమశిక్షణ ఆయన స్థాపించిన ట్రస్టు నడిపేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ట్రస్టు లక్ష్యాలు చేరుకునేందుకు ఎలాంటి ఒత్తిడిలకు గురి కావొద్దని నాగరాజు సూచించారు. ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా లొంగకుండా అవసరార్థులకు మాత్రమే ట్రస్టు సేవలు అందించాలని కోరారు. నిజమైన అవసరార్థులను ఎట్టి పరిస్థితుల్లో విస్మరించవద్దని.. వారికి సహాయ సహకారాలు అందించేందుకు అవసరమైతే ఆంక్షలు సడలించుకోవాలని సూచించారు. సమాజానికి, ఆపదలో ఉన్న వారికి సేవ చేయాలని లక్ష్యంతో ముందుకు వచ్చిన లక్ష్మణ్ రావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ఆయన ప్రారంభించిన ఈ సంస్థ లక్ష్యాలు చేరుకోవాలని.. భవిష్యత్‌లోనూ ట్రస్టు ద్వారా నిరుపేదలకు, అవసరార్థులకు నిరంతరాయంగా సేవలు కొనసాగాలని నాగరాజు ఆకాంక్షించారు.







సదర్ అంటే
తెలంగాణ ఆత్మగౌరవం

(మొదటి పేజీ తరువాయి..)

సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి, ఉత్తరప్రదేశ్ ఎంపీ ధర్మేంద్ర యాదవ్, బిహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌లు హాజరై సదర్ ఉత్సవాల ప్రత్యేకత, సంస్కృతి గొప్పతనం గురించి మాట్లాడారు.
సదర్ అంటే తెలంగాణ ఆత్మగౌరవమని, ఇది ఓ అద్భుతమైన కార్యక్రమమని సీఎం కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పండుగలాగా జరుపుతున్నామని, తమ ప్రభుత్వం వచ్చాక యాదవులను అన్ని విధాలుగా గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో అన్నీ రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని, యాదవులకు సముచిత స్థానం కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. తన చుట్టూ ఎప్పుడూ యాదవులు ఉంటారని, మంత్రివర్గ సమావేశాన్ని వాయిదా వేసుకొని సదర్ వేడుకకు హాజరయ్యానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. నగరంలో శాంతి భద్రతలు కాపాడుతూ, అందరిని ఒక తాటిపై ఉంచామని స్పష్టం చేశారు.

ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం అవ్వాలి
సదర్ ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. వ్యవసాయానికి పశుసంపద ఎంతో కీలకమని పశుసంపద అభివృద్ధి ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. సదర్ ద్వారా యాదవ సంస్కృతి ప్రపంచానికి చాటడమే కాదు, ఆర్థిక వ్యవస్థలో వారు భాగస్వామ్యం అవ్వాలని ఆకాంక్షించారు.

రిజర్వేషన్లు కల్పించాలి
యాదవ సమాజ ఐక్యత దేశవ్యాప్తంగా విస్తరించాలని బిహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్ ఆకాంక్షించారు. జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎలాంటి పరిస్థితుల్లోనైనా పోరాడతామని స్పష్టం చేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా హైదరాబాద్‌లో ఈ వేడుకలు నిర్వహించడం ప్రత్యేకమని ఉత్తరప్రదేశ్ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ అన్నారు. బలహీన వర్గాల ప్రజలంతా ఐకమత్యంతో ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

ధైర్యంగా ముందుకు సాగాలి
సదర్ పండుగ హైదరాబాద్ షాన్‌కు ప్రతీకగా నిలుస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. యాదవులు సామాజికంగా, విద్యాపరంగా ఎదగాలని పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సదర్ వేడుకలు సంప్రదాయాలు, సంస్కృతి, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తున్నాయని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. దీపావళి అంటే చెడుపై మంచి విజయం సాధించినట్లుగా ఎలాంటి సవాళ్లు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాలన్నారు.

యాదవుల పాత్ర ఎంతో కీలకం
అంతరించిపోతున్న ఆచారాలు, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయడమే సదర్ సమ్మేళనం ఉద్దేశమని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఆయన తెలిపారు. సదర్ సమ్మేళనం యాదవుల ఐక్యతకు చిహ్నమని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మహాభారతం నుంచి దేశ చరిత్ర వరకు యాదవుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఒకప్పుడు హైదరాబాద్‌కే పరిమితమైన ఈ వేడుక ఇప్పుడు ఇతర ప్రాంతాలకు విస్తరించడం సంతోషకరమన్నారు. యాదవులంతా సంఘటితంగా ఉండి భవిష్యత్తు రాజకీయాలను ప్రభావితం చేయాలని పిలుపునిచ్చారు.

కరువును అంచనా వేయడంలో ప్రభుత్వం విఫలం

- జిల్లాలో అన్ని మండలాలను అధిక కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి
- కలెక్టరేట్ ధర్నాలో ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్

వరంగల్, ఆయుధం: కరువును క్షేత్రస్థాయిలో పరిశీలించి శాస్త్రీయంగా అంచనా వేయకుండా.. కరువు తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు తీవ్ర నష్టాన్ని చేకూరుస్తున్నారని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ పేర్కొన్నారు. తక్షణమే వరంగల్ జిల్లా ను కరువు ప్రాంతంగా ప్రకటించి తక్షణ కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం రాష్ట్రానికి రూ.50 వేల కోట్ల కరువు నిధిని ఇవ్వాలని కోరారు. ఎంసీపీఐ(యు) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏకశిలా పార్కు నుంచి ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ... వరంగల్ జిల్లాలో కేవలం 8 మండలాలని మధ్యస్థ కరువు మండలాలుగా ప్రకటించి మిగతా ఐదు ప్రకటించకపోవడం అన్యాయం అన్నారు. భూగర్భ జలాలు అడుగంటి చెరువులు కుంటల్లో నీరు లేక రైతులు వేసిన పంటలన్నీ ఎండిపోయి దిగుబడి తగ్గి పెట్టుబడి రాక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే పట్టించుకోకపోవడం అలాగే ఉపాధి పనులు తగ్గిపోయి వ్యవసాయ కూలీలు కార్మికులు పనుల కోసం ఎదురు చూస్తున్నారని ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా కరువు తీవ్రతను జిల్లా యంత్రాంగం సరిగా అంచనా వేయడంలో వైఫల్యం చెందిందన్నారు. జిల్లాలోని అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు తక్షణమే వరంగల్ జిల్లా అధిక కరువు ప్రాంతంగా ప్రకటించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. తక్షణమే కరెంటు కోతలను నివారించి రైతులకు నీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. 14 రకాల నిత్యవసర వస్తువులను పేదలందరికీ ఉచితంగా అందించాలన్నారు. కరువుతో పంటలు కోల్పోయిన రైతాంగానికి పత్తి మిర్చి ఎకరాకు 50 వేలు, మొక్కజొన్న వరి పంటలకు ఎకరాకు రూ.30 వేలు ఇతర పంటలకు రూ.20వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మోర్తాల చందర్ రావు గోనె కుమారస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు తీవ్రత ఉన్నప్పటికీ కేవలం 255 మండలాలనే మధ్యస్థ కరువు మండలాలుగా 111 మండలాలను అధిక కరువు మండలాలుగా గుర్తించి చేతులు దులుపుకోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబా బాబురావు ముక్కెర రామస్వామి నగర కార్యదర్శి మాలోతు సాగర్ మాట్లాడారు. అనంతరం పార్టీ ప్రతినిధి బృందం జిల్లా డిఆర్ఓ విజయలక్ష్మి ద్వారా ప్రభుత్వానికి డిమాండ్లతో కూడిన మెమోరాండాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర జిల్లా నాయకులు సింగతి సాంబయ్య, సర్ర ప్రతాప్, వంగల రాగసుధ, కనకం సంధ్య, నాగెల్లి కొమురయ్య, సింగతి మల్లికార్జున్, సుంచు జగదీశ్వర్, నరసయ్య, గణిపాక ఓదెలు, ఇస్మాయిల్, నాగేష్, ప్రభాకర్, నరసయ్య, సురేష్, గణేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



పలుచోట్ల విస్తారంగా వర్షాలు

(మొదటి పేజీ తరువాయి..)

కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి.
ఖమ్మం కొత్తగూడెం ప్రధాన రహదారిలో నీళ్లు నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. జన్నారం వద్ద వాగు పొంగి ప్రవహించడంతో పోలీసులు రాకపోకలు నిలిపివేశారు. తల్లాడ మండలం రామచంద్రాపురం వద్ద ఏరు పొంగడంతో పది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాలో ప్రధానమైన వైరా జలాశయానికి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది.

మంత్రి తుమ్మల కీలక ఆదేశాలు
మురసు తుపాను ప్రభావం, వర్షాలపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో సమీక్షించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో వాగులు, వంకలు పొంగి పొర్లుతుండటంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంత్రి తుమ్మల అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. ప్రధాన జలాశయాల్లో ఉన్న నీటిమట్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానమైన జలాశయాల్లో నీరు చేరుతుండటంతో ఆయా నియోజకవర్గాల్లో శాసనసభ్యులతో మాట్లాడి వరద నీటిని కాలువలకు వదలాలని నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇవాళ మొత్తం వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ తీవ్ర హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. గ్రామాల్లోని పరిస్థితులపై ఎప్పటికప్పుడు ఆరా తీయాలని, అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695